క్లుప్తంగా

కబడ్డీ జిల్లా జట్టుకు మొవ్వ విద్యార్థిని ఎంపిక



మొవ్వ: స్థానిక మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని జొన్నలగడ్డ నాగ సంజన జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్స్‌పాల్ ఎస్. సాంబశివరావు తెలిపారు. కృష్ణా జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన అవనిగడ్డ జెడ్పీ ఉన్నత పాఠశాల్లో జరిగిన జూనియర్స్ బాల బాలికల జిల్లా స్థాయి కబడ్డీ సెలక్షన్స్ పోటీల్లో నాగ సంజన సత్తాచాటి జిల్లా జట్టుకి ఎంపికైంది. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. క్రీడాకారిణిని, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ అప్పికట్ల రామారావును, మండలి మనోహరిని హెచ్‌ఎం విద్యాకుటుంబం శుక్రవారం అభినందించారు.

బాధిత కుటుంబానికి సాయం అందజేత



పామర్రు: గ్రామ పంచాయతీ పరిధిలోని 11వ వార్డుకు చెందిన కొప్పుల నాగరాజు అనారోగ్యంతో గతంలో మృతి చెందారు. ఆయన కుటుంబానికి జగనన్న ప్రభుత్వం వైఎస్సార్ బీమా రూ.లక్ష మంజూరు చేశారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు మృతుడి కుటుంబానికి తక్షణ సాయం, మట్టి ఖర్చుల కింద రూ.10 వేల సాయాన్ని శుక్రవారం ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, స్థానిక వార్డుమెంబర్ మర్రెడ్డి రమాదేవి చేతుల మీదుగా నాగరాజు భార్య సుజాతకు తక్షణ సాయం అందజేశారు. కార్యక్రమంలో పామర్రు వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, నాయకులు మర్రెడ్డి అంజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు




మండవల్లి: ప్రకృతి వ్యవసాయ సాగుతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని మాస్టర్ ట్రైనర్ కాంతమ్మ తెలిపారు. మండలంలోని కొర్లపాడులో వాడరేవుల నాగవాణి సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను ఫీల్డ్ ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కాంతమ్మ శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జిలు నాగవిజయ, గౌతమ్‌కుమార్, ఐసీఆర్పీ నాగవాణి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

గుంటూరు కారం సినిమాలో పేర్లు మార్చాలి

గుడివాడ టౌన్: గుంటూరు కారం సినిమాలో ముఖ్య విలన్ పాత్రదారులకు కార్ల్‌మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టి సినిమా తీయడం తీవ్ర అభ్యంతరకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారతదేశ ఖ్యాతిని పెంచి స్వాతంత్ర్య సంగ్రామంలో కృషిచేసిన వీరయోధుల జ్ఞాపకాలను ఒక పుస్తకం రూపంలో ప్రజలకు చేరువ చేసిన మహానుభావులు కార్ల్‌మార్క్స్, లెనిన్ అని పేర్కొన్నారు. అట్టి మహానుభావులను తక్కువ చేస్తూ చిత్రాలు తీయడం ప్రజాస్వామ్య వాదుల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. తక్షణమే వారి పేర్లు మార్చి చిత్ర నిర్మాత, దర్శకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్.సమీర్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు ఆర్.కొండ, చల్లా రాంబాబు పాల్గొన్నారు.

11 ఎకరాల చెరకు తోట దగ్ధం



తోట్లవల్లూరు: విద్యుత్ తీగ తెగిపడటంతో చెరకుతోట దగ్ధమైన ఘటన మండలంలోని యాకమూరులో జరిగింది. గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో గాదె భగవాన్‌రెడ్డికి చెందిన తొమ్మిది ఎకరాల చెరకుతోట, బండి రాజ్యలక్ష్మికి చెందిన రెండు ఎకరాల చెరకుతోట శుక్రవారం సాయంత్రం దగ్ధమైంది. విద్యుత్ తీగ తెగిపడిన కారణంగానే చెరకు తోట దగ్ధమైనట్లు రైతులు తెలిపారు. ఉయ్యూరు ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో రూ. 1.80 లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు ఫైర్ సిబ్బంది పేర్కొన్నారు.

కులగణనతో బీసీలకు ఎంతో మేలు

తోట్లవల్లూరు: కులగణనతో బీసీలకు ఎంతో మేలు జరుగుతుందని బీసీ జనగణన సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు శుక్రవారం పేర్కొన్నారు. బ్రిటిష్ పాలనలో తప్ప స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాష్ట్రంలో ఇంతవరకు కులగణన జరగలేదని ఆయన తెలిపారు. కులగణనకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనీయులని, బీసీల తరపున కృతజ్ఞతలు చెబుతున్నామని పేర్కొన్నారు. కులగణనతో బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని శ్రీనివాసరావు ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కులగణనకు తీసుకున్న చర్యలతో భవిష్యత్‌లో బీసీలకు మంచి రోజులు రానున్నాయని బీసీ జనగణన సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తెలిపారు.

కులగణన సర్వే ప్రారంభం

తోట్లవల్లూరు మండలంలో కులగణనను అధికారులు శుక్రవారం ప్రారంభించారు. మండల వ్యాప్తంగా ఉన్న 13 గ్రామ సచివాలయాల పరిధిలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కులగణన వివరాల సేకరణ చేపట్టారు. మండలంలో 14,952 గృహాలకుగానూ 39,347 మందికి సంబంధించిన వివరాలు సేకరించాల్సి ఉంది. రొయ్యూరు, భద్రిరాజుపాలెంలో జరుగుతున్న కుల గణన సర్వేను ఎంపీడీఓ తుంగల స్వర్ణలత పరిశీలించారు. సర్వేకు సంబంధించి పలు అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.



సర్వేను ప్రారంభించిన ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్



తోటవల్లూరు మండలం భద్రిరాజుపాలెంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ స్వర్ణలత

పామర్రులో..

పామర్రు: కుల గణన సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలో కుల గణన సర్వే కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కుల గణన సర్వేను 10 రోజుల్లో పూర్తిచేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో కులగణనను పారదర్శకంగా ఏ విధమైన తప్పులు లేకుండా కచ్చితంగా నిర్వహించాలన్నారు. కుల గణణ సర్వేలు అన్ని కులాలకు చెందిన వారి వివరాలను కచ్చితంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రమీళ, విస్తరణాధికారి డి.జయప్రకాష్, మండల ఆర్బీకే అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



మండల స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

పమిడిముక్కల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆడుదాం.. ఆంధ్రా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కబడ్డీ, వాలీబాల్ పోటీలను ఎంపీడీఓ కొండేటి వెంకటేశ్వరరావు, ఏఓ రాజు, కార్యదర్శి ప్రసాద్ శనివారం ప్రారంభించారు. క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, పీడీలు పాల్గొన్నారు.

వనవలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలోని నిజాంపేటలో వేంచేసియున్న విజయ వనవలమ్మ 107వ జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు డెప్యూటీ మేయర్ శీలం భారతి, బాబ్జీ దంపతులు, విన్నకోట వనప్రభాకర్, శైలజ దంపతులు, మిరియాల రామకృష్ణ, అమ్మాజీ దంపతులు, పొన్నూరు శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి దంపతులు, నరహరిశెట్టి కనకదుర్గప్రసాద్, విజయలక్ష్మి దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుహాసినీలతో లలితా పారాయణం చేశారు. అమ్మవారి చీరల ప్రసాదాన్ని దంపతులకు అందజేశారు. కమిటీ సభ్యులు వనప్రభాకర్ మాట్లాడుతూ కొండరాతి స్తంభాలతో దేవాలయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ఏటా సంక్రాంతి తర్వాత ఆదివారం జాతర మహోత్సవాలు నిర్వహిస్తామని భక్తులు మొక్కుబడులు చెల్లించుకోవాలని కోరారు.

ఘనంగా ముగిసిన పేరంటాలమ్మ ఉత్సవాలు

రామవరప్పాడు: రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో వారం రోజులుగా జరుగుతున్న సంక్రాంతి ఉత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. గత ఆరు రోజులుగా రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ప్రసాదంపాడులో రథోత్సవం ముగింపు అనంతరం ఆలయం ఎదుట అమ్మవారి విగ్రహాలు చేరుకున్నాయి. గ్రామంలోని నూతన వంతెన సమీపంలోని రైవస్ కాలువలో హంస ఆకారంలో ప్రత్యేకంగా అలంకరించిన పడవలో అమ్మవార్లను ఉంచి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.



రైవస్ కాలువలో తెప్పోత్సవం

అనంతరం ఆలయం సమీపంలోని రావిచెట్టు ఎదుట ఇరు గ్రామ పెద్దలు, భక్తులు కలిసి రకరకాల పుష్పాలతో అలంకరించిన ఊయలలో అమ్మవార్లను ఉంచి పూలంకి సేవను నిర్వహించారు. అనంతరం ముగ్గురమ్మలను ఆలయంలోనికి తీసుకెళ్లారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు స్వచ్ఛందంగా వెళ్లిన అభిమానులు



నాగవరప్పాడులోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని



మండవల్లిలో జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



కూచిపూడి నుంచి తరలివెళుతున్న అభిమానులు

మండవల్లి: విజయవాడలో జరిగే సామాజిక సమతా సంకల్పానికి మండవల్లి మండలం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా 10 బస్సుల్లో వెళ్లినట్లు తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎ.ఆనందబాబు శుక్రవారం తెలిపారు. ఈ బస్సులను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. తొలుత ఎమ్మెల్యే డీఎన్నార్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, నాయకుడు మెండా సురేష్, ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు పాల్గొన్నారు.

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల సామాజిక న్యాయ మహాశిల్పం విగ్రహావిష్కరణకు మొవ్వ మండలం నుంచి అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండల పరిధిలోని 21 గ్రామాల నుంచి ప్రజలు తరలి వెళ్లారని ఎంపీడీఓ జి.సుధాప్రవీణ్ తెలిపారు.

కైకలూరులో..

కైకలూరు: సామాజిక సమతా సంకల్ప సభకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి విజయవాడకు వేలాదిగా అభిమానులు శుక్రవారం తరలి వెళ్లారు. నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ ఉత్సాహంగా వెళ్లారు. నాలుగు మండలాల్లో అంబేద్కర్ విగ్రహాలకు దళిత నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కుమారులు వినయ్, శ్యామ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లారు. మంటాడలో వాహనాలను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, ప్రజాప్రతినిధులు జెండా ఊపి ప్రారంభించారు.

పామర్రులో..

పామర్రు: విజయవాడలో బీఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ప్రారంభోత్సవం సందర్భంగా పామర్రులోని స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద నుంచి ర్యాలీగా శుక్రవారం బయలుదేరారు. స్థానిక కూడలి వద్ద ఉన్న బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సోదరుడు కైలే జగదీష్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. మండల పరిధి ఉరుటూరు శివారు నల్లగుంట నుంచి బస్సు కూడా అభిమానులు తరలి వెళ్లారు

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: విజయవాడలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణకు మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు శుక్రవారం తరలివెళ్లారు. జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ జిల్లా కన్వీనర్ మోర్ల రామచంద్రరావు, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, నాయకులు పొత్తూరి రవి, దేవరపల్లి చంద్రశేఖర్, తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.



గుడివాడలో ర్యాలీగా బయలుదేరిన అంబేద్కర్ అభిమానులు

భారీగా తరలిన అభిమానులు

గుడివాడ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో నిర్మించిన సామాజిక స్మృతివనం లోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పట్టణంలోని అంబేద్కర్ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. తొలుత స్థానిక నాగవరప్పాడులోని అంబేద్కర్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో అంబేద్కర్ అభిమానులు, దళిత నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నాగవరప్పాడు నుంచి బయలుదేరిన ఈ ర్యాలీ నెహ్రూచౌక్, మార్కెట్ సెంటర్ మీదుగా బాపూజీ నగర్, అంబేద్కర్ విగ్రహం, కోతిబొమ్మ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహాల వరకు సాగి ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి పెద్ద సంఖ్యలో విజయవాడకు తరలివెళ్లారు. బైక్ ర్యాలీలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్, ఎంపీపీ పెయ్యల ఆదాం, మట్టా జాన్ విక్టర్, వెంపటి సైమన్, అత్తాటి సాల్మన్, ఏలేటి విలియం జోషి, జోషి, సీహెచ్ నాని, మెండా చంద్రపాల్, మెండా రవికుమార్, తంటిపూడి బాబి, మామిళ్ల ఎలీషా పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహావిష్కరణకు పమిడిముక్కల నుంచి తరలి వెళ్లిన నాయకులు, అభిమానులు



తోట్లవల్లూరులో జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరెడ్డి



పామర్రులో కూడలి వద్ద జెండా ఊపి బస్సు ర్యాలీని ప్రారంభిస్తున్న కైలే జగదీష్

ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి: ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. శుక్రవారం కొచ్చెర్ల గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందులను అందజేశారు.



మందులను అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మానవాళి జీవనానికి ఆదర్శమూర్తి యోగి వేమన

గుడివాడ టౌన్: మానవాళి జీవనానికి ఆదర్శమూర్తి యోగి వేమన అని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో యోగి వేమన జయంతి ఉత్సవాలు శుక్రవారం నిర్వహించారు. తొలుత మున్సిపల్ కమిషనర్, ఉద్యోగులు వేమన చిత్రపటానికి పూలమాల, వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమాజంలో మనిషి జీవితాన్ని, జీవన విధానాన్ని వ్యక్తిగతంగా అనుభవించి, పరిశోధించి ఆయన సూక్తుల ద్వారా సమాజానికి మంచి నడవడి అందించిన మహానుభావులు వేమన అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఐ.శ్రీనివాసులు, టీపీఓ నాగేంద్రప్రసాద్, ఆర్వో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ పనులు, విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా శనివారం పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ టి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కైకలూరులో..

కైకలూరు: విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం కైకలూరు టౌన్ సెక్షన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ టి.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండలంలో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని ఉయ్యూరు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి. కృష్ణానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, పాములలంక, దేవరపల్లి, పెనమకూరు, యాకమూరు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్‌లైన్లు, సబ్‌స్టేషన్లలో సాంకేతిక మరమ్మతుల కారణంగా ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు.

బ్రాహ్మణులకు సంక్రాంతి కానుకలు



పామర్రులో బ్రాహ్మణులకు ఎమ్మెల్యే ఇచ్చిన కానుకలను అందిస్తున్న నాయకులు



అడ్డాడలో అర్చకులకు కానుకలను అందజేస్తున్న నాయకులు

పామర్రు: పామర్రు నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రతి ఒక్క బ్రాహ్మణ కుటుంబానికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సౌజన్యంతో సంక్రాంతి కానుకలను అందజేశారు. పామర్రు మండలంలోని బ్రాహ్మణులకు శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు వీటిని అందజేశారు. పామర్రులోని భేతన బొట్టరాజా తదితర బ్రాహ్మణులకు వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, విజయవాడ కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు జిల్లా సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, వార్డు మెంబరు శ్రీహరి పాల్గొన్నారు.

■ అడ్డాడలోని ఆలయ అర్చకులకు స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు బలుసు హరికిరణ్, వైఎస్సార్ సీపీ నాయకులు పామర్తి వెంకటేష్ తదితరులు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అందించిన కానుకలను పంపిణీ చేశారు.

పెదమల్లును ఆదుకున్నది కొడాలి నానీయే

గుడివాడ టౌన్: ఆర్యవైశ్య ప్రముఖుడు పెదమల్లు ఆంజనేయులు మృతిని సైతం చంద్రబాబు నాయుడు రాజకీయం చేయడం నీచమైన చర్య అని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గురువారం పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన కదలిరా సభలో ఆయన చేసిన వ్యాఖ్యలను నాయకులు తీవ్రంగా ఖండించారు. పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పెదమల్లు ఆంజనేయులు పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారని అనంతరం కరోనా రావడంతో ఆర్థికభారం ఎక్కువ కావడం కారణంగా కుటుంబ సభ్యులను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేయలేక ఆత్మహత్యకు పాల్పడితే కొడాలి నానీ అనుచరుల ఒత్తిడి కారణంగానే మృతి చెందారని 14 ఏళ్లు ముఖ్యమంత్రి చేసిన నాయకుడు అనడం నీచమైనచర్య అన్నారు. ఆయన బతికున్న రోజుల్లో ఆయనతో కలిసి వ్యాపారం చేసి ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేసిన వ్యక్తులు చంద్రబాబు ప్రసంగించిన వేదికపై ఉండటం ఆయన గమనించుకోలేకపోయారన్నారు. ఆంజనేయులు మృతి అనంతరం ఇతరుల నుంచి ఏ విధమైన ఒత్తిళ్లు కుటుంబ సభ్యులపై రాకుండా చూసే బాధ్యతను కొడాలి నానీ తనకు అప్పగించారని, పెట్టుబడి పెట్టిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేసేలా ఎమ్మెల్యే కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆంజనేయులు కుమారుడు మణికంఠ కుమార్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తన తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డారని, దీనిలో కొడాలి నానీ ప్రమేయం ఏమీ లేదని పేర్కొన్నారు. 'నా తండ్రి మృతి అనంతరం వచ్చిన ఒత్తిళ్ల నుంచి బయటపడేందుకు ఎమ్మెల్యే ఎంతో కృషి చేశారు' అని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వర్గీకరణపై సానుకూల నిర్ణయం తీసుకోవాలి

గన్నవరం: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఇంటలెక్చువల్ ఫోరమ్ ఫర్ మాదిగాస్ రాష్ట్ర అధ్యక్షుడు మట్టా విద్యార్థి శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ గౌబా నేతృత్వంలోని కమిటీ మాదిగలు, మాదిగ ఉపకులాల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. తద్వారా రానున్న పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని కేంద్రానికి విన్నవించారు. దీనివల్ల మాదిగలు, మాదిగ ఉపకులాలు ఉన్నతికి తోడ్పాడాలని కోరారు.